క్లుప్తంగా

ఉపాధి హామీ పనులను వేగవంతం చేయాలి



పొన్నూరు: మండలంలో జరుగుతున్న ఉపాధి హామీ పనులను వేగవంతం చేయాలని డ్వామా పీడీ వి.శంకర్ అన్నారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధి హామీ పనుల పురోగతిపై అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామాల్లోని పంట పొలాల్లో చేపడుతున్న నీటి కుంటలను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. గ్రామాల్లో నీటి కుంటలు మంజూరై ఇంకా ప్రారంభం కాని వాటిని వెంటనే ప్రారంభించి నీటి కుంటల నిర్మాణ లక్ష్యాన్ని పూర్తి చేయాలన్నారు. కార్మికులకు 100 రోజుల పని కల్పించడమే లక్ష్యంగా సిబ్బంది బాధ్యతలు నిర్వహించాలని అన్నారు. సమావేశంలో ఎంపీడీవో గుమ్మా చంద్రశేఖరరావు, ఏపీవో సుభాషిణి, టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్‌లు, సిబ్బంది పాల్గొన్నారు.

ఏఎంసీ చైర్ పర్సన్‌గా పఠాన్ రిజ్వాన



పొన్నూరు: పొన్నూరు వ్యవసాయ మార్కెట్ యార్డు చైర్ పర్సన్‌గా పట్టణానికి చెందిన పఠాన్ రిజ్వాన నియామకమయ్యారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్రకుమార్ నివాసంలో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో రిజ్వానను సత్కరించి అభినందించారు. కార్యక్రమంలో కూటమి నాయకులు, ప్రముఖులు పాల్గొని చైర్ పర్సన్‌కు శుభాకాంక్షలు తెలిపారు.

భక్తి శ్రద్ధలతో మహా రుద్రయాగం



పొన్నూరు: పట్టణంలోని శ్రీ సహస్ర లింగేశ్వరస్వామి దేవస్థానంలో శుక్రవారం శ్రీ త్రయాహ్నిక పూర్వక చండీ సహిత మహా రుద్ర యాగం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. వేదమూర్తులు పొన్నూరు షణ్ముఖ రఘు కిషోర్ శర్మ ఆధ్వర్యంలో ఉదయం సుప్రభాత సేవతో కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. దేవాలయ ప్రదక్షిణ, మూల విరాట్‌కు అర్చన, గణపతి పూజ, పుణ్యాహవాచనం, పంచగవ్యప్రాసన, గోపూజ, అంకురారోపణ, విశేష అర్చనలు, అగ్నిప్రతిష్ఠాపన, హోమాలు, నిరాజన మంత్రపుష్పములను ఘనంగా నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలను అందించారు.

గ్రామ దేవతకు ప్రత్యేక పూజలు



మంచాల(చేబ్రోలు): చేబ్రోలు మండలం మంచాల గ్రామంలోని గ్రామ దేవత దేశమాంబ అమ్మవారికి శుక్రవారం ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. సకాలంలో వర్షాలు కురవాలని, పంటలు సమృద్ధిగా పండాలని, గ్రామం సుఖ శాంతులతో ఉండాలని కోరుతూ గ్రామస్తులు ప్రత్యేక పూజలు చేశారు. మేళతాళాలతో ఊరేగింపుగా అధిక సంఖ్యలో మహిళలు దేవాలయానికి చేరుకున్నారు. ఆలయ అర్చకులు జలాభిషేకం, వివిధ అభిషేకాలతో అమ్మవారికి విశేష పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ప్రత్యేక అలంకరణలో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు.

రేపు మెగా ఉచిత వైద్యశిబిరం

తాడేపల్లి రూరల్: చినకాకాని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ఆదివారం మంగళగిరి శ్రీ సత్యసాయి భజన మండలి ఆధ్వర్యంలో హైదరాబాద్ ఏషియల్ వ్యాస్కులర్ హాస్పటల్ సహకారంతో మెగా ఉచిత వైద్యశిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు శ్రీ సత్యసాయి సేవా సంస్థల రాష్ట్ర వైద్య విభాగం అధ్యక్షులు పూసపాటి సాయి కృష్ణ తెలిపారు. పాఠశాలలో శుక్రవారం ఆయన వైద్య శిబిరానికి సంబంధించిన వివరాలను వెల్లడించారు. వైద్య శిబిరం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు జరుగుతుందన్నారు. గ్రామ పరిసర ప్రాంతాల ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో శ్రీ సత్యసాయి భజన మండలి కన్వీనర్ డాక్టర్ రాయపాటి రామారావు, హాస్పటల్ మార్కెటింగ్ మేనేజర్ వి.నవీన్ పాల్గొన్నారు.

సెల్లార్లు మాయం.. తనిఖీలు శూన్యం

- వాహనాలకు పార్కింగ్ ఇబ్బందులు
- చోద్యం చూస్తున్న టౌన్ ప్లానింగ్ అధికారులు



పొన్నూరు మున్సిపల్ కార్యాలయం

పొన్నూరు: పురపాలిక సంఘం పరిధిలో భవన, వాణిజ్య సముదాయాల సంఖ్య రోజురోజుకూ పెరుగుతోంది. చిన్న చిన్న సందుల్లో కూడా మూడు, నాలుగు అంతస్తుల భవనాలు నిర్మిస్తున్నారు. కనీసం అగ్నిమాపక వాహనం, పరికరాలు తిరిగేందుకు స్థలం ఉండాలని భవన యజమానులు మరచిపోతున్నారు. మరోవైపు వాణిజ్య సముదాయాలకు తప్పని సరిగా పార్కింగ్ ఉండాలనే నిబంధనలకు తిలోదకాలు వదిలేస్తున్నారు. సెల్లార్లు ఉన్నా వాటిలోనూ దుకాణాలు నిర్వహిస్తున్నారు. ఫలితంగా పట్టణంలో పార్కింగ్ సమస్య జఠిలంగా మారుతోంది. చర్యలు తీసుకోవాల్సిన పట్టణ ప్రణాళికాధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. కూటమి అధికారంలోకి వచ్చాక భవన నిర్మాణాలు ఇష్టానుసారంగా సాగుతున్నాయి.

ప్రణాళికకు విరుద్ధంగా..

పట్టణంలో లక్షకు పైగా జనాభా నివసిస్తున్నారు. 150 నుంచి 200 వరకు వాణిజ్య సముదాయాలు, 100 నుంచి 150 వరకు బహుళ అంతస్తుల భవనాలు ఉన్నాయి. వీటిలో చాలా వాటికి సెట్‌బ్యాక్‌లు లేవు. భవనానికి నాలుగు వైపులా ఖాళీ స్థలాలు వదలాల్సి ఉండగా ఆ ప్రదేశాల్లో కూడా నిర్మాణాలు చేపడుతున్నారు. ఒక విధంగా ప్రణాళిక చూపి మరో విధంగా నిర్మాణాలు చేస్తున్నారు. సెల్లారులో పార్కింగ్ స్థలం చూపించి నిర్మాణాలు పూర్తయ్యే చివరి దశలో దుకాణాలుగా మార్చి అద్దెలకు ఇస్తున్నారు.

ఇరుకు రోడ్లతో సమస్యలు..



ఎస్పీపీ రోడ్డులో నిలిచిన ట్రాఫిక్

సెల్లార్లలో అక్రమంగా దుకాణాలు ఏర్పాటు చేయడంతో ట్రాఫిక్ సమస్య పెరుగుతోంది. ప్రధానంగా జీబీసీ రోడ్డు, ఎస్పీపీ రోడ్డు, ముబారక్ నగర్, కసుక్రు రోడ్డు ఇలా పలు ప్రాంతాల్లో ఈ పరిస్థితి నెలకొంది. కొంతమంది వ్యాపారులు రహదారులను సైతం ఆక్రమించి దుకాణాలు నిర్వహిస్తున్నా టౌన్ ప్లానింగ్ అధికారులు పట్టించుకోవడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. దీంతో వాహనాలను రోడ్లపైనే నిలుపుతున్నారు. డ్రెయిన్ నిర్మాణాలకు అడ్డుగా ఉన్న ఇళ్లకు చెందిన మెట్లు, బడ్డీ బంకులను యుద్ధప్రాతిపదికన తొలగించే అధికారులు, పార్కింగులు లేకుండా చేపడుతున్న భవన నిర్మాణాలను చూసీ చూడనట్లు వదిలేయడం పట్ల అధికారుల పనితీరుపై తీవ్ర ఆరోపణలు వస్తున్నాయి.

చర్యలు తీసుకుంటున్నాం..



భవన యజమానులకు సెల్లార్లు తప్పనిసరి అని హెచ్చరిస్తున్నాం. నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు చేపట్టే వారికి నోటీసులు అందిస్తున్నాం. భవన నిర్మాణాలు చేపట్టే సమయంలో తనిఖీలు చేపడుతూ, విరుద్ధంగా చేపట్టే నిర్మాణాలపై తగిన చర్యలు తీసుకుంటున్నాం.

–రాఘవరావు, టీపీఎస్, పొన్నూరు

స్మార్ట్ మీటర్లను ప్రతిఘటించాలి



కార్యక్రమంలో మాట్లాడుతున్న నాయకులు

పెదకాకాని: ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న స్మార్ట్ మీటర్లను ప్రజలు వ్యతిరేకించాలని ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి పుప్పాల సత్యనారాయణ, సీఐటీయూ జిల్లా కార్యదర్శి నన్నపనేని శివాజీలు అన్నారు. పెదకాకానిలోని సుందరయ్య కాలనీ సీఐటీయూ కార్యాలయంలో ప్రజా సంఘాల ఆధ్వర్యంలో శుక్రవారం స్మార్ట్ విద్యుత్ మీటర్లకు వ్యతిరేకంగా రౌండ్ టేబుల్ సమావేశాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి రైతు కూలి సంఘం సహాయ కార్యదర్శి దానబోయిన భాస్కరరావు అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న సత్యనారాయణ, శివాజీలు మాట్లాడుతూ.. విద్యుత్ స్మార్ట్ మీటర్లు బిగించడానికి వస్తే ప్రజలు ప్రతిఘటించాలని కోరారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు ఆర్.వెంకటేశ్వర్లు, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు యు.శివయ్య, బి.సాంబయ్య, కౌలు రైతు సంఘం నాయకులు సంకూరి నీలాంబరం, మహిళా సంఘం జిల్లా కార్యదర్శి రెంటాల కుమారి, ఏఐటీయూసీ నాయకులు రామిశెట్టి శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.



ఫాగింగ్‌ను విస్మరించిన అధికారులు!

పొన్నూరు పట్టణంలో అధికారులు ఫాగింగ్ పద్ధతిని విస్మరించారు. ఇందిరానగర్ కాలనీ, అంబేడ్కర్ కాలనీ, ఐటికంపాడు రోడ్డు, క్యాబిన్‌పేట, డీవీసీ కాలనీ, ముబారక్ నగర్, డఫ్‌పేట, రవి కాలనీ, సంజీవ్ నగర్, రైలుపేట తదితర ప్రాంతాల్లో ఫాగింగ్ జరుగక దోమల బెడద ఎక్కువగా ఉంటోంది. ఇక్కడి కాలువలు చెత్తాచెదారాలతో పూడుకుపోతున్నాయని.. కాలువలు శుభ్రం చేయాల్సిన సిబ్బంది కొన్ని ప్రాంతాలను పూర్తిగా విస్మరిస్తున్నారని పలు ప్రాంతాల ప్రజలు పేర్కొంటున్నారు. పురపాలికలో ఫాగింగ్ యంత్రాలు అందుబాటులో ఉన్నా సక్రమంగా ఉపయోగించడంలేదని వారు వాపోతున్నారు. సక్రమంగా ఫాగింగ్ చేసి దోమల ఉధృతిని తగ్గించాలని స్థానికులు వేడుకుంటున్నారు. – పొన్నూరు

గుండె సమస్యలకు నూతన పరిష్కారం

కేఎల్‌యూ విద్యార్థిని పరిశోధన



శ్రేయ కొసనం

తాడేపల్లి రూరల్: వడ్డేశ్వరం కేఎల్ యూనివర్సిటీలోని ఫార్మసీ కళాశాలలో పరిశోధన విద్యార్థిని శ్రేయ కొసనం గుండె సంబంధిత సమస్యలకు మొక్కల ఆధారిత చికిత్సలకు నూతన పరిష్కారాలను కనుగొన్నట్లు కేఎల్ ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ చక్రవర్తి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. డాక్టర్ రాజేశ్వరి పసుపుల మార్గదర్శకత్వంలో గుండె సంబంధిత వ్యాధులపై పరిశోధన చేసిన శ్రేయ సాంప్రదాయ మొక్కల నుంచి గుండెకు ఏర్పడే పలు రకాల సమస్యలకు ఔషధాలు తయారు చేయవచ్చుననే నివేదికను తయారు చేసినట్లు ఆయన తెలిపారు. అందుకు గానూ శ్రేయ కేఎల్ ఫార్మసీ కళాశాల నుంచి పీహెచ్‌డీ డిగ్రీని అందుకున్నట్లు పేర్కొన్నారు. ఆమె చేసిన పరిశోధనను మెడికల్ పరిభాషలో 'ఇన్వెస్టిగేషన్స్ ఆఫ్ మిథైల్ గ్లెకోసైడ్ అండ్ సిన్నమోయిల్ డెరివేటివ్ ఫ్రమ్ అగనోస్మా డైకోటోమా ఎగైనెస్ట్ మయోకార్డియల్ ఇస్కీమియా–రిపెర్‌ఫ్యూజన్ ఇంజురీ, ఇంటిగ్రేటింగ్ కంప్యూటేషనల్ టెక్నిక్స్ విత్ సెల్ లైన్ వాలిడేషన్ యూజింగ్ హెచ్9సీ2 కార్డియోమయోసైట్స్' అనే తన థీసిస్‌కు గానూ కేఎల్‌యూ ఫార్మసీ కళాశాల వారు శ్రేయకు పీహెచ్‌డీ ప్రదానం చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా డాక్టర్ చక్రవర్తి, డైరెక్టర్ డాక్టర్ బుచ్చినాయుడు, ఆర్ ప్యాక్ చైర్మన్ డాక్టర్ నరేంద్ర పరిశోధనా విద్యార్థిని శ్రేయను అభినందించారు.

రైతుల సమస్యల పరిష్కారంలో అలసత్వం వద్దు



అర్జీలు స్వీకరిస్తున్న నోడల్ అధికారిణి జయశ్రీ

తాడికొండ: రైతుల సమస్యల పరిష్కారంలో అలసత్వం వహించవద్దని జీఆర్ఎం నోడల్ అధికారిణి పి.జయశ్రీ అన్నారు. రైతులు, రైతు కూలీల సమస్యల పరిష్కారం కోసం తుళ్లూరులోని సీఆర్డీయే కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన గ్రీవెన్స్ డేలో ఆమె రైతుల నుంచి అర్జీలు స్వీకరించారు. భూ సమీకరణ పథకం, వార్షిక కౌలు చెల్లింపు తదితర సమస్యల గురించి పలువురు రాజధాని ప్రాంత వాసులు తమ అర్జీలను గ్రీవెన్స్ రిడ్రెస్సల్ మేనేజ్‌మెంట్(జీఆర్ఎం) నోడల్ అధికారిణి జయశ్రీకి అందజేశారు. ఇచ్చిన ఫిర్యాదులలో పలు సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించగా మిగిలినవి వీలైనంత త్వరగా పరిష్కరించాలని ఆమె సంబంధిత అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు బి.సాయి శ్రీనివాస నాయక్, ఎం.శేషిరెడ్డి, కేఎస్.భాగ్యరేఖ, పి.పద్మావతి, జి.రవీందర్, జి.భీమారావు, ఎ.జి.చిన్నికృష్ణ, సీఆర్డయే సర్వే విభాగ అసిస్టెంట్ డైరెక్టర్ జి.పాండురంగారావు రామకృష్ణన్, సీఆర్డీయే సామాజిక సంక్షేమ విభాగ డీసీడీవో బి.శ్రీనివాసరావు, తహసీల్దార్లు పాల్గొన్నారు.

పాఠశాల అభివృద్ధికి సహాయం

దుగ్గిరాల: దుగ్గిరాల జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల అభివృద్ధికి జంపాల సుబ్బారావు రూ.10 వేల విరాళాన్ని శుక్రవారం పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు యస్.శోభాదేవికి అందించారు. పాఠశాల అభివృద్ధి, పలు మరమ్మతుల పనుల నిమిత్తం నగదు అందజేసినట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా హెచ్ఎం ఆయనకు ధన్యవాదాలు తెలిపారు.

వెంగళాయపాలెంలో స్వచ్ఛ రథం



గుంటూరు రూరల్: మండలంలోని వెంగళాయపాలెం గ్రామంలో శుక్రవారం పైలట్ ప్రాజెక్ట్‌గా నిర్వహిస్తున్న స్వచ్ఛ రథం కార్యక్రమాన్ని నిర్వహించారు. 7వ రోజు కార్యక్రమాన్ని పురస్కరించుకుని పంచాయతీరాజ్ కమిషనర్ మైలవరపు కృష్ణతేజ, అడిషనల్ కమిషనర్ సుధాకర్‌లు కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. కార్యక్రమంలో భాగంగా స్వచ్ఛ రథం పనితీరును పరిశీలించారు. ఘన వ్యర్థాలు విక్రయించి నిత్యావసర వస్తువులను కొనుగోలు చేసిన ప్రజలతో వారు మాట్లాడారు. గ్రామంలో పర్యటించి పారిశుద్ధ్య పనులను పరిశీలించారు. కార్యక్రమంలో జెడ్పీ సీఈవో జ్యోతి బసు, ఇన్‌చార్జి ఎంపీడీవో శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శి వి.రవి, గ్రామ సర్పంచ్ నల్లపాటి లలితకుమారి, పంచాయతీ సిబ్బంది, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

స్వచ్ఛ గ్రామాలకు అందరూ సహకరించాలి

పెద్దివారిపాలెం(కాకుమాను): ప్రతి గ్రామాన్ని స్వచ్ఛ గ్రామంగా మార్చేందుకు అధికారులతో పాటు గ్రామస్తులు కూడా సహకరించాలని ఎంపీడీవో కె.యుగకీర్తి అన్నారు. మండలంలోని పెద్దివారిపాలెంలో శుక్రవారం గ్రామ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ.. గ్రామాలు పరిశుభ్రంగా ఉన్నప్పుడే గ్రామస్తులు సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారని ఆమె తెలిపారు. ఇంటిలో వ్యర్థాలను ఎక్కడ పడితే అక్కడ వేయకుండా పంచాయతీ వాహనం వచ్చినప్పుడు చెత్తను తడి, పొడిగా విభజించి వాహనంలో వేయాలని ఆమె సూచించారు. కార్యక్రమంలో డెప్యూటీ ఎంపీడీవో రవిబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

రహదారులపై నిలిచిన వర్షం నీరు



పెదకాకాని: చిన్నపాటి వర్షానికే పెదకాకాని శివారులోని పల్లాలమ్మ ఆలయం ఎదుట సర్వీసు రోడ్డు పైకి మురుగు చేరుతోంది. అదే ప్రదేశంలో స్పీడ్ బ్రేకర్, అండర్ ఫుట్ బ్రిడ్జి ఉండటంతో ఆ నీటిలో ప్రయాణాలు సాగించడానికి వాహనదారులు అవస్థలు పడుతున్నారు. పాదచారులు గత్యంతరం లేక ఆ మురుగు నీటిలోనే రాకపోకలు సాగిస్తున్నారు. సంబంధిత అధికారులు సర్వీసు రోడ్డుపైకి మురుగు చేరకుండా చర్యలు తీసుకోవాలని వాహనదారులు, ప్రజలు కోరుతున్నారు.

శ్రీ మహంకాళీ ఆలయంలో రోటరీ సేవలు



దుగ్గిరాల: పర్యావరణం పరిరక్షణలో భాగంగా శ్రీ మహంకాళీ అమ్మవారి దేవస్థానం ఆవరణలో రోటరీ క్లబ్ సభ్యులు మొక్కలు నాటారు. శుక్రవారం రోటరీ తెనాలి, మంగళగిరి క్లబ్‌ల ఆధ్వర్యంలో అసిస్టెంట్ గవర్నర్ ఈదర వెంకటపూర్ణచంద్ జన్మదినం సందర్భంగా మొక్కలు నాటారు. ఫారెస్ట్ డిస్ట్రిక్ట్ గవర్నర్ అన్నే రత్న ప్రభాకర్ కేకు కట్ చేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో దేవస్థాన ఈవో కె.సునీల్‌కుమార్, అనిల్‌కుమార్, నల్లూరి వెంకటేశ్వరరావు, పి.రాజశేఖర్, నిరంజన్ గుప్తా, శ్రీనివాస్, మురళీ, బాలకృష్ణ, ఓబుల్‌రెడ్డి పాల్గొన్నారు.

విద్యార్థులకు కడుపు నిండా భోజనం పెట్టాలి



విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న అధికారులు

కాకుమాను: విద్యార్థులకు రోజూ కడుపు నిండా భోజనాన్ని అందించాలని ఎంఈవో కె.ఎఫ్.కెన్నడీ అన్నారు. పెదనందిపాడు మండలంలోని గొరిజవోలుగుంటపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అమలవుతున్న మధ్యాహ్న భోజన పథకాన్ని శుక్రవారం ఆయన ఎంఈవో–2 జాకబ్‌తో కలిసి పరిశీలించారు. ఈసందర్భంగా కెన్నడీ మాట్లాడుతూ.. విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు మధ్యాహ్న భోజన పథకాన్ని అమలు చేస్తున్నట్లు తెలిపారు. పాఠశాలలకు సూచించిన మెనూ తప్పని సరిగా అమలు చేయాలని ఆయన ఆదేశించారు. పాఠశాలలోని ఉపాధ్యాయుడు రత్నారెడ్డి గత రెండేళ్లుగా తమ సొంత ఖర్చుతో విద్యార్థులకు పెరుగును సరఫరా చేస్తుండడంతో ఆయనను ఎంఈవోలు అభినందించారు. అనంతరం విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనాన్ని రుచి చూశారు. కార్యక్రమంలో హెచ్ఎం చంద్రశేఖర్, ఉపాధ్యాయులు ఉన్నారు.

వానాకాలం చదువులు.. పిల్లలకు ఇబ్బందులు!



తూర్పుపాలెం ప్రాథమిక పాఠశాల వరండాలోనికి చేరిన వర్షపునీరు



తరగతి గదిలోనికి నీరు చేరడంతో పొరుగింటి వరండాలో పాఠాలు బోధిస్తున్న ఉపాధ్యాయురాలు

ప్రత్తిపాడు: బడికెళితే ఆడుకోవచ్చు.. బడికెళితే చదువుకోవచ్చు.. బడికెళితే మంచిగా బతకవచ్చు.. అక్షరాలు నేర్చుకోవచ్చు.. ఆహ్లాదంగా గడపొచ్చు.. ఇలా ఎన్నో మాటలు తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు చెబుతుంటారు. కానీ శిథిల భవనాలు ఉంటాయని, వానొస్తే వరండాల్లోకి వర్షపు నీరు వస్తుందని, తరగతి గది తడిసిపోతుందని, బల్లలున్నా కాళ్ల కిందకు వాన నీళ్లు చేరుతాయని, కొన్ని చోట్ల పాఠం కోసం పొరుగింటిని ఆశ్రయించాల్సి వస్తుందనీ, ప్రభుత్వాలు, పాలకులు, అధికార యంత్రాంగం పట్టించుకోరని.. పాపం విద్యార్థులకు తెలియదు. వానాకాలం చదువులు ఇలాగే ఉంటాయని, వాన కురిస్తే అవస్థల పాఠం తప్పదనీ వారికి తెలియదు. అందుకు నిలువెత్తు సాక్ష్యమే ఈ చిత్రాలు. ప్రత్తిపాడు మండలంలో గురువారం రాత్రి నుంచి శుక్రవారం ఉదయం వరకు కురిసిన భారీ వర్షాలకు పలు స్కూళ్లు నీట మునిగాయి. ప్రత్తిపాడు పంచాయతీ పరిధిలోని తూర్పుపాలెంలో ఉన్న ప్రాథమిక పాఠశాల వరండాలోనికి, తరగతి గదుల్లోనికి వర్షపు నీరు రావడంతో బడిలో పాఠాలు చెప్పలేని పరిస్థితి ఏర్పడింది. దిక్కుతోచని స్థితిలో పొరుగున ఉన్న ఓ ఇంటి వరండాలో పిల్లలను కూర్చోబెట్టుకుని ఆ స్కూలు టీచర్ పాఠాలు బోధించారు.

మహిళలపై పెరుగుతున్న దాడులు



మాట్లాడుతున్న చిలువూరు ఫిలోమినా

తాడేపల్లి రూరల్: కూటమి ప్రభుత్వంలో మహిళలపై అరాచకాలు పెరిగాయని.. తాజాగా కృష్ణాజిల్లా జిల్లా పరిషత్ చైర్మన్ ఉప్పల హారికపై దాడి ఘటనే అందుకు నిదర్శనమని వైఎస్సార్‌సీపీ మహిళా నాయకురాళ్లు ధ్వజమెత్తారు. ఆత్మకూరులోని నియోజకవర్గ పార్టీ కార్యాలయంలో శుక్రవారం నియోజకవర్గ మహిళా సంఘం ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు చిలువూరు ఫిలోమినా మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వంలో మహిళలకు రక్షణ లేకుండా పోయిందని మండిపడ్డారు. పట్టణ అధ్యక్షురాలు సంకే సునిత, గుంటూరు జిల్లా వైఎస్సార్ సీపీ ఉపాధ్యక్షురాలు పచ్చల రత్నకుమారి మాట్లాడుతూ.. మహిళా జిల్లా పరిషత్ చైర్మన్ పర్యటనను అడ్డుకుని మారణాయుధాలతో దాడి చేయడం దారుణమని అన్నారు. గుంటూరు జిల్లా వైఎస్సార్‌సీపీ జిల్లా యాక్టివిటీ కార్యదర్శి మల్లవరపు సుధారాణి, తాడేపల్లి పట్టణ వైఎస్సార్‌సీపీ అధ్యక్షురాలు దర్శి విజయశ్రీ మాట్లాడుతూ.. మహిళలు బయటకు వస్తే ప్రాణాలు గుప్పెట్లో పెట్టుకోవాల్సి వస్తోందని వాపోయారు. కార్యక్రమంలో దుగ్గిరాల మండల మహిళా అధ్యక్షురాలు పెండ్యాల సంసోనమ్మ, తాడేపల్లి మండల మహిళా అధ్యక్షురాలు గోరా నాగ ప్రవంతి, మంగళగిరి పట్టణ 15వ వార్డు మాజీ కౌన్సిలర్ కలకోటి స్వరూపారాణి, మంగళగిరి పట్టణ ప్రధాన కార్యదర్శి తుమ్మ పద్మ, మంగళగిరి పట్టణ కార్యదర్శి గుంటి రాజ్యలక్ష్మి, మిట్ట నిర్మల తదితరులు పాల్గొన్నారు.

దేవస్థాన పునః నిర్మాణానికి విరాళం

మంగళగిరి టౌన్: మంగళగిరి పట్టణ పరిధిలోని కుప్పరావుకాలనీలో పునః నిర్మిస్తున్న హనుమత్ లక్ష్మణ సీతా సమేత శ్రీ రాముల వార్ల దేవస్థానానికి మంగళగిరి ఎమ్మెల్యే, విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ రూ.5 లక్షల విరాళాన్ని ప్రకటించారు. ఈ విరాళాన్ని స్థానిక నాయకులు శుక్రవారం కమిటీ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర పద్మశాలి కార్పొరేషన్ చైర్మన్ నందం అబద్ధయ్య మాట్లాడుతూ.. శ్రీ రాముని కృపతో ప్రజలంతా సుఖసంతోషాలతో జీవించాలని అన్నారు. కార్యక్రమంలో టీటీడీ సభ్యురాలు తమ్మిశెట్టి జానకీదేవి, గుంటూరు పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి పోతినేని శ్రీనివాసరావు, మంగళగిరి పట్టణ అధ్యక్షులు పడవల మహేష్, ప్రధాన కార్యదర్శి షేక్ రియాజ్, నాయకులు వాసా పద్మ, తిరువీధుల సతీష్, బిక్షారావు, బత్తుల శ్రీను, గుంటి మోహన్, దేవస్థానం కమిటీ అధ్యక్షులు మునగాల వెంకట రత్నం, ఉపాధ్యక్షులు కొల్లి హనుమంతరావుపాల్గొన్నారు.

జీజీహెచ్‌లో అరుదైన శస్త్రచికిత్స

- 10లక్షల మందిలో ఒకిరికి వచ్చే అరుదైన ట్యూమర్
- ఆపరేషన్ చేసి ప్రాణాలు కాపాడిన జనరల్ సర్జరీ వైద్యులు



మాట్లాడుతున్న డాక్టర్ యశస్వి రమణ, పక్కన డాక్టర్ ఏకుల కిరణ్‌కుమార్, డాక్టర్ జి. కిరణ్‌కుమార్

గుంటూరు మెడికల్: ప్రతి పది లక్షల మందిలో ఇద్దరు లేదా నలుగురికి మాత్రమే అత్యంత అరుదుగా వచ్చే ట్యూమర్‌కు గుంటూరు జీజీహెచ్ జనరల్ సర్జరీ వైద్యులు అరుదైన ఆపరేషన్ చేసి రోగి ప్రాణాలు కాపాడారు. శుక్రవారం జనరల్ సర్జరీ వైద్య విభాగంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆపరేషన్ వివరాలను జనరల్ సర్జరీ నాలుగో యూనిట్ ప్రొఫెసర్ డాక్టర్ జి.కిరణ్‌కుమార్ మీడియాకు వెల్లడించారు.

గుంటూరుకు చెందిన 28 సంవత్సరాల జీవన్ స్రవంతి రెండు సంవత్సరాల క్రితం మూడు నెలల గర్భిణిగా ఉన్నపుడు బొడ్డుపై హెర్నియాకి ల్యాప్రోస్కోప్ ద్వారా ఒక ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స చేయుంచుకున్నట్లు చెప్పారు. ఆపరేషన్ తరువాత రెండు నెలలకు పొట్ట మీద కణిత వచ్చి, అది క్రమేపీ పెరిగి పెద్దది అవుతుండడంతో పలు ఆసుపత్రులు తిరిగి చివరకు గుంటూరు ప్రభుత్వాసుపత్రికి గత నెలలో వచ్చినట్లు తెలిపారు. ఉదరంపై ఏర్పడిన డెస్మాయిడ్ ట్యూమర్‌కి ఆరు లక్షల ఖరీదు ఆపరేషన్‌ను ఎన్టీఆర్ వైద్యసేవ కింద రెండు వారాల క్రితం ఉచితంగా చేశామన్నారు. ల్యాప్రోస్కోప్, ట్యూమర్ వైడ్ లోకల్ ఎక్సిషన్, కాంపోజిట్ మెష్ రిపేర్‌ను విజయవంతంగా చేసినట్లు వెల్లడించారు. డెస్మాయిడ్ ట్యూమర్ క్యాన్సర్‌గా మారే అవకాశం ఉందని చెప్పారు. రోగి తరచూ చెకప్ చేయించుకోవాలని సూచించారు. ఈ ఆపరేషన్ ప్రక్రియలో తనతోపాటుగా జనరల్ సర్జరీ వైద్యులు అరుణ, గీతిక, అక్షయ్, సత్యదేవ్, రవి, పావని, వెంకట రమణ మత్తు వైద్యులు పోలయ్య, శాంసన్, సంతోష్ పాల్గొన్నట్లు వెల్లడించారు. అరుదైన ఆపరేషన్ చేసి రోగి ప్రాణాలు కాపాడిన సర్జరీ వైద్యులను సర్జరీ వైద్య విభాగాధిపతి డాక్టర్ ఏకుల కిరణ్‌కుమార్, ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ యశస్వి రమణ అభినందించారు.